సాక్షి
మంచిర్యాల

బుధవారం ౹ 25 ౹ అక్టోబర్ ౹ 2023



యంత్రంతో ప్రజాతంత్రం..
ఎన్నికల పోలింగ్ అనగానే ఒకప్పుడు బ్యాలెట్ బాక్సులు, పేపర్లు గుర్తొచ్చేవి. క్రమేణా మార్పు వచ్చింది. బ్యాలెట్ పేపర్ స్థానంలో ఈవీఎంలు, వీవీ ప్లాట్లు వచ్చేశాయి. 10లో▸



దసరా.. సంబురం
జిల్లా వ్యాప్తంగా విజయదశమి సంబురాలు సోమవారం అంబరాన్నంటాయి. రావణాసుర దహనం, జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /18.2

వాతావరణం
చాలా వరకు ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతుంది. రాత్రి ఉష్ణోగ్రత తగ్గుతుంది. చలిప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బెల్లంపల్లి ఎమ్మెల్యేకు నిరసన సెగ

- ప్రచారాన్ని అడ్డుకున్న గిరిజనులు
- పోడు భూములు, అభివృద్ధిపై నిలదీత



కుష్నపల్లిలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న గిరిజనులు

నెన్నెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ఎన్నికల ప్రచారంలో నిరసన ఎదురైంది. సమస్యలు పరిష్కరించకుండా ప్రచారానికి ఎందుకు వస్తున్నారంటూ నెన్నెల మండలం కుశ్నపల్లి గిరిజనులు నిలదీశారు. ప్రచారం ప్రారంభించిన మొదటి రోజే చేదు అనుభవం ఎదురైంది. కుశ్నపల్లి హన్మాన్ మందిర్‌లో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించడానికి ఎమ్మెల్యే చిన్నయ్య వస్తున్నారని తెలుసుకున్న గిరిజనులు ఆయన కాన్వాయ్‌ని గ్రామంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోడు భూముల పట్టాల కోసం ఏళ్ల తరబడి తిరిగినా పట్టించుకోని ఎమ్మెల్యే ఇప్పుడు ఎందుకు వస్తున్నాడంటూ నిలదీశారు. తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని మండిపడ్డారు. పోడు పట్టాల గురించి ఎప్పుడు అడిగినా ఇదిగో అదిగో అంటూ కాలం వెల్లదీస్తూ వచ్చారని, ఇప్పుడు ఓట్లు వేయమంటే ఎలా వేసేదని ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న గిరిజనులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు సముదాయించేందుకు ప్రయత్నించగా వారి మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కల్పించుకుని శాంతింపజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయానికి చేరుకుని పూజలు చేసి ప్రచారం నిర్వహించారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

- మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి
- జిల్లా కేంద్రంలో ఘనంగా అలయ్ బలయ్ కార్యక్రమం




మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి

పాతమంచిర్యాల: రాజ్యాధికార సాధన కోసం బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాధికార సాధన కోసం బీసీలు 20 ఏళ్లుగా ఉద్యమిస్తున్నారని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ ఈబీసీలు, బీసీలను గుర్తించక పోవడం అన్యాయమన్నారు. బీసీలు చేస్తున్న ఉద్యమాలను అన్ని రాజకీయపార్టీలు గమనిస్తున్నాయని, రాజకీయ పార్టీలలో చలనం రావడం ఉద్యమాల ఫలితమే అన్నారు. మంచిర్యాలలో బీసీలు చేస్తున్న రాజ్యాధికార ఉద్యమాలు తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని వ్యాఖ్యానించారు. 2018 జరిగిన బీసీల ఉద్యమంపై దేశ వ్యాప్తంగా రాజకీయ పార్టీలు చర్చించుకున్నట్లు వివరించారు. బీసీలు ఉద్యమాలు చేస్తే లాభపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. 2026 లో ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముందని, తెలంగాణలో 17 నుంచి 35 స్థానాలు పెరిగే అవకాశముందని తెలిపారు. దీంతో బీసీలు చట్టసభలకు వెళ్లే అవకాశం పెరుగుతుందన్నారు. ఇందు కోసం 'మనమెంతో మన కంత' అనే నినాదంలో మన వాటా కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మంచిర్యాల దేశానికి దిక్సూచి..
మంచిర్యాలలో బీసీ వాదం, పలు రకాలుగా చేస్తున్న బీసీ ఉద్యమాలను దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలను ఆలో చింపజేస్తున్నాయన్నారు. ఇక్కడి ఉద్యమాలు దేశానికి దిక్సూచిగా ఉన్నాయని ఉద్యమకారులను నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి, బీసీ సంఘాల నాయకులు సన్మానించారు. అలయ్ బలయ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వృత్తిసంఘాలు, కుల సంఘాల నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, నాయకులు డాక్టర్ రఘునందన్, డాక్టర్ రమణ, డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, నీలి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, కొయ్యల హేమాజీ తదితరులుపాల్గొన్నారు.

యువ ఓటర్లే కీలకం

- జిల్లాలో 18 నుంచి 29 ఏళ్ల లోపు వారు 1,39,184 మంది
- 30–39 ఏళ్లలోపు వారు 1,72,176 మంది
- అసెంబ్లీ ఎన్నికల్లో వారే నిర్ణేతలు



మంచిర్యాలటౌన్: దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందన్నది మన నేతల మాటలు. ఈ మాటలు త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అక్షర సత్యం కానున్నాయి. ఇప్పటికే జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో యువ ఓటర్ల సంఖ్య గతంలో కంటే బాగా పెరిగింది. ప్రస్తుతం మూడు నియోజకవర్గ అభ్యర్థుల భవిష్యత్ యాత్ చేతిలోనే ఉంది. వారు ఎటువైపు మొగ్గితే అటే విజయావకాశం ఉంది. అయితే అన్ని పార్టీలు ప్రస్తుతం యువతను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. స్థానికంగా పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు యువతను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీలో చేరే యువతను ప్రోత్సహిస్తున్నారు. యువతను ఆకర్షించేందుకు ఎవరికి వారు ప్రయత్నిస్తుండగా, చివరికి యువ ఓటర్లు ఎవరిని గెలిపిస్తారోననే పోటీ చేసే అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది.

యువ ఓటర్లే అధికం...
మంచిర్యాల జిల్లాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువతే ఫలితాలను తేల్చేలా ఉన్నారు. మంచిర్యాల జిల్లాలో 6,17,901 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 3,08,630 మంది, మహిళలు 3,09,229, ఇతరులు 42 మంది ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లో 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసు గల ఓటర్లు 1,39,184 మంది జిల్లాలో ఉంటే, 30–39 ఏళ్ల మధ్య వయసు వారు 1,72,176 మంది ఉన్నారు. జిల్లాలో 6,17,901 మంది ఓటర్లలో 18–39 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు మొత్తం ఓటర్లలో సగానికి పైగా 3,11,360 మంది ఉండగా, 40 ఏళ్లు పైబడిన వారు 3,06,541 మంది ఉన్నారు. దీంతో జిల్లాలో బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులు యువ ఓటర్లను ఆకట్టుకునే వ్యూహాలకు పదును పెడుతున్నారు. 39 ఏళ్లలోపు వారిలో దాదాపుగా 90 శాతం వరకు స్మార్ట్ ఫోన్లు కలిగి ఉండగా, వారికి వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో యువత ఎటువైపు మొగ్గితే వారికే విజయావకాశాలు పెరగనున్నాయి. గత ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మక్కువ చూపిన ఓటర్లు, ప్రస్తుతం అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగులకు ఉపాధి వంటి అంశాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వనుండడంతో, పోటీల్లో నిలబడ్డ అభ్యర్థులు ఏమేరకు యువతను ప్రసన్నం చేసుకుంటారనే దానిపైనే గెలుపోటములు ఆధార పడే అవకాశం ఉంది.

జిల్లాలోని ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
చెన్నూరు	91,969	92,141	7	1,84,117
బెల్లంపల్లి	84,790	84,796	12	1,69,598
మంచిర్యాల	1,31,871	1,32,292	23	2,64,186
మొత్తం	3,08,630	3,09,229	42	6,17,901

ముగిసిన దేవీ నవరాత్రులు



హారతి ఇస్తున్న బెంగాలీలు, భక్తులు



నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు..

- భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి శోభాయాత్ర...
- ఆకట్టుకున్న పోతరాజుల వేషధారణలు, భక్తుల నృత్యాలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు అందుకున్న దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవారం నిమజ్జన మహోత్సవం నిర్వహించారు. మంచిర్యాల గౌతమినగర్ కోదండ రామాలయం, గర్మిళ్ల అభయాంజనేయస్వామి ఆలయంతోపాటు పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం గోదావరినదికి నిమజ్జనానికి తరలించారు. సర్వజనీ దుర్గాదేవి పూజా కమిటీ ఐదు రోజులపాటు బెంగాలీల ఆధ్వర్యంలో పూజలు అందుకున్న దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర మంగళవారం వైభవంగా జరిగింది. స్థానిక విశ్వనాథాలయ కాలక్షేప మండపం నుంచి పురవీధుల గుండా శోభాయాత్రగా గోదావరి నదికి నిమజ్జనానికి తరలించారు. దుర్గాదేవి విగ్రహంతోపాటు సరస్వతీ, లక్ష్మి, గణనాథుడు, కార్తికేయ విగ్రహాలను ఊరేగింపు జరిపారు. అమ్మవారికి ప్రత్యేకంగా ధూప, దీప హారతులు ఇస్తూ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఒగ్గుడోలు, పోతరాజుల విన్యాసాలు, భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్వజనీ దుర్గాదేవి పూజ కమిటీ అధ్యక్షుడు బోడ ధర్మేందర్, సభ్యులు రీనారాణి తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పోతరాజుల విన్యాసాలు

బీజేపీలో 'బీసీ'నాదం!

- మంచిర్యాల అభ్యర్థి ఎంపికపై కసరత్తు
- ఆ వర్గాలకు టికెట్ ఇచ్చే అంశంపై చర్చ
- ఓసీలపై పోటీకి బీసీ అభ్యర్థి కోసం అన్వేషణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నినాదంతో ముందుకు వస్తున్న భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జిల్లాలోనూ ఈ ఫార్ములా అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంచిర్యాల నియోజకవర్గానికి ఆ పార్టీ అభ్యర్థిగా ఈసారి వెనకబడిన తరగతులకు చెందిన నాయకుడినే బరిలో దింపితే ఎలా ఉంటుందనే కోణంలో కసరత్తు చేస్తోంది. తొలి జాబితాలో జిల్లా పరిధిలో బెల్లంపల్లి స్థానానికి పోటీ చేసే అభ్యర్థి పేరు మాత్రమే వెల్లడైంది. చెన్నూరు, మంచిర్యాల స్థానాలకు రెండో జాబితాలో ఖరారు కానున్నాయి. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ధర్మపురి, చెన్నూరు, బెల్లంపల్లి మూడు ఎస్సీ, పెద్దపల్లి, మంథని, రామగుండం, మంచిర్యాల నాలుగు జనరల్ స్థానాల్లో రామగుండం బీసీకి కేటాయించగా, మిగతా జనరల్‌స్థానాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల బరిలో నిలిచే బీసీ అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. 2018 ఎన్నికల్లో ప్రస్తుత పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆయన మరోసారి ఇక్కడ టికెట్‌పై ఆశలు పెట్టుకుని నియోజకవర్గంలో పనిచేస్తున్నారు. అయితే ఈ ఎన్నికల్లో బీసీ నినాదం తెరపైకి రావడం, బీఆర్ఎస్, కాంగ్రెస్ బీసీలకు అవకాశం ఇవ్వకపోవడంతో ఆ వర్గాల అసంతృప్తిని క్యాచ్ చేసుకునేలా ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పార్టీలో ఉన్న నాయకులు సైతం ఈసారి టికెట్ బీసీలకు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు.

తెరపైకి ముఖేశ్‌గౌడ్?
పార్టీలో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ నాయకుల పేర్లు మంచిర్యాల అభ్యర్థిగా మొదట పరిశీలన చేస్తున్నారు. మరోవైపు ఇటీవల బీసీ ఉద్యమంలో కీలకంగా ఉన్న మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న బీఆర్ఎస్ నాయకుడిని ఆ పార్టీ అభ్యర్థిగా గాజుల ముఖేశ్‌గౌడ్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆయన పార్టీలో చేరేందుకు కీలక నాయకులతో టచ్‌లో ఉంటూ మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుత అసెంబ్లీ, తర్వాత పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపడేందుకు ఇతర పార్టీల నాయకుల చేరికలను కూడా ప్రోత్సహిస్తున్నారు. అయితే మొదట పార్టీలో ఉన్న బీసీల్లో ఉన్న ప్రధాన సామాజికవర్గాలైన పెరిక, మున్నూరు, ముదిరాజ్, పద్మశాలి, ముదిరాజ్ నాయకుల్లో సరైన వారు ఎవరెవరున్నారనే లెక్కలు తీశారు. మంచిర్యాల నియోజకవర్గంలో సింహభాగం బీసీ ఓట్లు ఉండడంతో ఆయా సామాజికవర్గాల సమీకరణాలను కలుపుకుపోతే ప్రధాన పార్టీల్లో పోటీదారులకు గట్టిపోటీ ఇవ్వొచ్చనే దిశగా కార్యాచరణ జరుగుతోంది. ఈ క్రమంలోనే బీసీ రాజ్యాధికార సాధన సమితికి చెందిన బీసీ నాయకులతోపాటు మరికొందరు బీసీ నాయకులను సొంత పార్టీతో పాటు ఇతర పార్టీలో ఉన్న ప్రజల్లో గుర్తింపు ఉన్నవారిపై ప్రధానంగా ఫోకస్ పెట్టింది. విద్యార్థి, యువజన సంఘాల్లో కీలకంగా ఉండి పార్టీలో పనిచేస్తున్న వారిని కూడా బీసీ అభ్యర్థిగా బరిలో దింపే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు

- ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు
- పలు సూచనలు చేసిన సీపీ రెమా రాజేశ్వరి



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి



హాజరైన సీఆర్‌పీఎఫ్ కమాండోలు

మంచిర్యాలక్రైం: నవంబర్ 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పంపిన కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. ఎన్నికల నిర్వహణకు 230 మంది మహిళా కమాండోలతో కేంద్ర బలగాలు వచ్చాయి. మంగళవారం సీఏపీఎఫ్, సీఆర్‌పీఎఫ్ మహిళా కమాండోలతో కమిషనరేట్‌లోని హెడ్ క్వార్టర్స్‌లో ఎన్నికల నిర్వహణపై మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాల పోలీస్ అధికారులతో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణ, భారత ఎన్నికల సంఘం విధించిన నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో, ఎన్నికల అనంతరం జిల్లాలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కేంద్ర బలగాలతో స్థానిక పోలీస్ అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. ఎన్నికల భద్రతలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు ఐదు సీఆర్‌పీఎఫ్ కంపెనీ బలగాలు రావడం జరిగిందన్నారు. అందులో అధికారులతో కలిపి 284 మంది రావడం, అందులో 230 మంది మహిళా కమాండోలే ఉన్నారని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, చేతన, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్, అడిషనల్ కమాండెంట్ దినేష్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ మాంజిమా, కురియకొసే తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



కవాతులో కలెక్టర్, సీపీ, డీసీపీ

మంచిర్యాలక్రైం: ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని సీఆర్‌పీఎఫ్, సీఏపీఎఫ్ కేంద్ర ప్రత్యేక మహిళా కమాండోలతో కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి మార్కెట్ ఏరియా నుంచి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం వరకు కవాతు(బ్రీఫింగ్ సేషన్) మంగళవారం నిర్వహించారు. అనంతరం కలెక్టర్, సీపీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతారణంలో నిర్వహించేలా స్థానిక అధికారుల సమన్వయంతో భారత ఎన్నిక సంఘం సూచనల మేరకు పని చేయాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల బందోబస్తు, రూట్ బందోబస్తు, కార్డన్ అండ్ సెర్చ్ అండ్ ప్రత్యేక ఆపరేషన్ల నిర్వహణకు అన్నివిధాలా సహకరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కవాతులో స్థానిక డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్, సీఐలు, ఎస్సైలు కేంద్ర బలగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా జోష్..

- జిల్లాలో రూ.30 కోట్లకు పైగా వ్యాపారం
- ఎన్నికల వేళ మరింత కిక్కిచ్చిన మద్యం అమ్మకాలు
- గుడిపేట లిక్కర్ డిపోలో ఒక్కరోజే భారీగా అమ్మకాలు
- అంతే జోరుగా మాంసం విక్రయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాల క్రైం: దసరా జోష్ జోరు అంతా ఇంతా కాదు.. ఎన్నికల సమయం కావడంతో ఈసారి జోరు పెరిగింది. ఏకంగా మార్కెట్‌లో దాదాపు రూ.30 కోట్లకుపైగా వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది. విజయదశమి పర్వదినోత్సవాన సంతోషాల కోసం ఎలాంటి ఖర్చుకు వెనకాడలేదు. మంచిర్యాల జిల్లా కేంద్రంతోపాటు కోల్‌బెల్ట్ పరిధిలోని సీసీసీ, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్, చెన్నూర్, జైపూర్, భీమారం, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి తదితర ప్రాంతాల్లో దసరా సంబురాలకు ఏకంగా రూ.30 కోట్లపైగానే ఖర్చు చేశారు. ప్రధానంగా మద్యం, మాంసం అమ్మకాలతోపాటు నూతన వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, మిఠాయిలు ఇతర కొనుగోళ్లకు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు.

ఒక్కరోజే రూ.10 కోట్లు..
గతేడాది దసరాకు జిల్లాలో నాలుగు రోజుల్లో దాదాపు రూ.14.20 కోట్ల వ్యాపారం సాగగా ఈ ఏడాది జోష్ మరింత పెరిగింది. కేవలం ఒక్కరోజులోనే అంటే అక్టోబర్ 21న మంచిర్యాల జిల్లా గుడిపేట లిక్కర్ డిపోలో రూ.10 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరిగాయంటే అమ్మకాలు ఏ స్థాయిలో జరిగాయో తెలుస్తోంది. జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలకు 5,237 లిక్కర్ కేస్‌లు, 7,825 బీర్ కేస్‌లు అమ్మగా వీటి విలువ రూ. 5.30 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు. ఇక డిపో పరిధిలో మొత్తంగా చూస్తే 8,800 లిక్కర్ కేస్‌లు, 15.500ల బీర్ కేసులు అమ్మగా వీటి విలువ 9.50 కోట్లు ఉంటుందని తెలిపారు. డిపో మొత్తంగా జరిగిన మద్యం అమ్మకాల్లో మంచిర్యాల జిల్లాలోనే మద్యం విక్రయాలు పెరిగాయని చెప్పారు. డిపో పరిధిలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, మంథని, భూపాలపల్లి జిల్లాలోని కాటారం, జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మద్యం దుకాణాలు, బార్లు ఉన్నాయి.



హాజీపూర్ మండల గుడిపేట లిక్కర్ గోదాము

జోరుగా మాంసం అమ్మకాలు...
దసరా సందర్భంగా మాంసం అమ్మకాలకు పెద్ద పీట ఉంటుంది. మంచిర్యాలలోనే 100 వరకు చికెన్, 45 వరకు మటన్ దుకాణాలు ఉండగా జిల్లా మొత్తంగా అనధికారికంగా 200లు పైగా మాంసం దుకాణాలు ఉండగా గ్రామాలు, పట్టణాల్లో కలిపి వేల సంఖ్యలో యాటలు(మేకలు, మేక పోతులు, గొర్రె పోతులు) తెగినట్లు తెలుస్తోంది. మంచిర్యాల, సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోనే కాకుండా జిల్లాలో మొత్తంగా దాదాపు రూ. 5ు కోట్లకుపై వ్యాపారం జరిగినట్లు సమాచారం. దసరా సందర్భంగా సోమ, మంగళవారాల్లో ఈ మటన్, చికెన్ అమ్మకాలు పోటాపోటీగా సాగాయి.



మేకలు కొనుగోలు చేస్తున్న జనం

నూతన వస్త్రాలు.. వాహనాలు..
బట్టల దుకాణాలు, షాపింగ్ మాల్స్‌తోపాటు ఎలక్ట్రానిక్స్, హోం అప్లయెన్సెస్, వాహనాల కొనుగోళ్లు తదితర వ్యాపారాలు సైతం జోరుగా సాగాయి. దసరా సందర్భంగా రూ.10 కోట్లకు పైగానే వస్త్ర వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది. ఎలక్ట్రానిక్, హోం అప్లయెన్స్‌స్ దుకాణాలతోపాటు మిఠాయిలు, కూల్‌డ్రింక్స్ వ్యాపారంతో పాటు పలు వ్యాపారాలు, ద్విచక్ర వాహన, కార్ల కొనుగోళ్లు దసరా సందడితో అధికం కాగా ఈ వ్యాపారమంతా మొత్తంగా రూ.10 కోట్లపై మాటే జరిగింది. ఇక వివిధ మొబైల్ దుకాణాలు కూడా రూ.లక్షల్లో వ్యాపారం చేశాయి. ఏది ఏమైనా దసరా ఆనందోత్సాహాలకు కొదవ లేకుండా పోవడమే కాదు దసరా సంబురాల జోష్ ఏటేటా పొరుగుతూనే ఉంది.

2022లో దసరా రోజు మద్యం అమ్మకాలు

లిక్కర్	3,498 కేస్‌లు
బీర్	11022 కేస్‌లు
మొత్తం విలువ	రూ.4.65 కోట్లు

2023లో దసరా రోజు మద్యం అమ్మకాలు

లిక్కర్	5,237 కేస్‌లు
బీర్	7,825
మొత్తం విలువ	రూ.5.29 కోట్లు

క్లుప్తంగా

బీదర్ టూ నాగ్‌పూర్ వీక్లి స్పెషల్ రైలుకు హాల్టింగ్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మీదుగా బీదర్ టూ నాగ్‌పూర్, నాగ్‌పూర్ టూ బీదర్ వరకు వీక్లి స్పెషల్ ట్రెన్ (ఎక్స్‌ప్రెస్)కు తెలంగాణలో రాష్ట్రంలోని పలు స్టేషన్లలో హాల్టింగ్ (స్టాప్) ఇచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే సోమవారం నిర్ణయం తీసుకుంది. వారంలో ఒక్క రోజు ఆదివారం బీదర్ నుంచి ప్రారంభమైన ట్రెన్ సోమవారం మంచిర్యాలకు చేరుకుంటుంది. ఈ ట్రెన్ తెలంగాణలోని జహీరాబాద్, మార్పా ల్లి, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపెల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్లలో స్టాప్‌లు ఉన్నాయి. ఈ అవకాశాన్ని రైలు ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారు లు తెలిపారు.

కలప పట్టివేత



పట్టుబడిన కలపతో ఫారెస్టు అధికారులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి నుంచి టా టా ఏసీ ట్రాలీలో కలప తరలిస్తున్నారనే సమా చారం మేరకు ఆ వాహనాన్ని పట్టుకోగా డ్రైవర్ పారిపోయినట్లు రేంజర్ రవి తెలిపారు. పట్టు బడిన 17 కలప దుంగలను కోటపల్లి రేంజ్‌కు తరలించారు. వాటి విలువ సుమారు రూ.75వే లు ఉంటుందని తెలిపారు. బీట్ ఆఫీసర్ నదీం మొద్దీన్, సత్యనారాయణ, బేస్‌క్యాంప్ సిబ్బం ది చిరంజీవి, అశోక్, నవాజ్, సంపత్, సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తు తెలియన వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య గర్మిళ్ల శివారులో సోమవారం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(35) ఆత్మ హత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపా రు. ఆయన వివరాల ప్రకారం ... రైల్వే లోకో పైలె ట్ సమాచారం మేరకు స్థానిక జీఆర్‌పీ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధా రాలు లభించలేదు. శరీరంపై బిర్లా ఏ-1 సిమెంట్ కంపెనీకి చెందిన టీ షర్ట్ ధరించి ఉ న్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మా ర్చురి గదిలో భద్రపరిచారు. ఇతర వివ రాలకు 87 12580664 నంబర్‌లో సంప్రదిం చాలని సూచించా రు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

న్యాయవాది కారు దగ్ధం



దగ్ధమైన కారు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో నివాసం ఉంటున్న గూడురు సత్యనారాయణ సీనియర్ న్యాయవాదికి చెందిన కారును గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. ఇంటి ఎదుట నిలిపి ఉన్న కారును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని, సత్య నారాయణకు కోర్టు కేసుల్లో వ్యతిరేకంగా ఉన్న ఓ మహిళా ఈ ఘాతకానికి పాల్పడినట్లు ఆయన అనుమానాలు వ్యక్తం చేశాడు. ఈ సం దర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఇలాం టి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

యంత్రంతో ప్రజాతంత్రం...

- ఎన్నికల్లో ఓటింగ్ మిషన్ల ప్రాధాన్యత
- పకడ్బందీగా, పారదర్శకంగా..
- సాంకేతికత వినియోగంలో ఈవీఎం, వీవీప్యాట్లు



ఈవీఎం యంత్రం



నిర్మల్ జిల్లా కేంద్రంలో పోలింగ్ విధానంపై కొనసాగుతున్నశిక్షణ

జంగ్ తెలంగాణ

నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల పోలింగ్ అనగానే ఒకప్పుడు బ్యాలెట్ బాక్సులు, పేపర్లు గుర్తొచ్చేవి. ఒక్కొక్క ఓటుకు ఒక్కొక్క బ్యాలెట్ పేపర్‌పై స్వస్తిక్ ముద్రను వేసి ఓటు హక్కును వినియోగిం చుకునేవారు. కాలక్రమేణా పోలింగ్ ప్రక్రియలో మార్పు వచ్చింది. బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్ స్థానంలో ఈవీఎంలు, వీవీ ప్లాట్లు వచ్చేశాయి. గతంలో బ్యాలెట్ పేపర్‌తో ఓటింగ్ ముగిసిన వెం టనే వాటిని భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి తర లించేవారు. అక్కడ ఒక్కొక్క బ్యాలెట్ పేపర్‌ను వేరు చేస్తూ కట్టలు కట్టేవారు. బ్యాలెట్ బాక్సుల్లో ఏ పార్టీకి ఎన్ని కట్టలు వచ్చాయనని లెక్కించేవారు. ఫలితాల కోసం కూడా సుదీర్ఘంగా నిరీక్షించాల్సి వచ్చేది. ఓటింగ్ వ్యవస్థలో సాంకేతికత వచ్చేసింది. ఎన్నికల్లో పారదర్శకతను పెంచి, ప్రక్రియ సరళ తరం చేసేందుకు ఓటింగ్ మిషన్లు అత్యంత గణనీయంగా ఉపయోగపడుతున్నాయి.

ఈవీఎం నేపథ్యం...

ఈవీఎం యంత్రం ప్రధానంగా మూడు భాగాలుగా ఉంటుంది.
బీయూ (బ్యాలెట్ యూనిట్)
సీయూ (కంట్రోల్ యూనిట్)
వీవీప్యాట్.. (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అండ్ ట్రయల్)

భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో 1980లో ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగ ళూరు వారు సంయుక్తంగా ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ను తయారు చేశారు. వీటిని మొట్టమొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని ఫారోవర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో 50 పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించారు. 2004లో తొలిసారిగా దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు.

వీవీ ప్యాట్..

ఈవీఎం ద్వారా ఓటరు తాను వేసిన ఓటును నిర్ధా రించడానికి వీవీ ప్లాట్ ఉపయోగపడుతుంది. ఓటు వేయగానే వీవీప్యాట్‌లో ఆ అభ్యర్థి వేసిన ఓటుగు ర్తును స్లిప్‌లో ముద్రిరించి ఇస్తుంది. దాదాపు ఏడు క్షణాల పాటు ఆ స్లిప్పు ఓటరుకు కనిపిస్తుంది. అనంతరం దానంతట అదే వీవీప్యాట్‌లో ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో పడిపోతుంది. తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిని తొలిసారిగా ఉపయోగించారు.

విద్యుత్ అంతరాయం కలిగితే ఎలా..

ఈవీఎం యంత్రాలు బ్యాటరీల ఆధారంగా పనిచేసేలా రూపొందించారు. మొదటితరం ఎం-2 ఈవీఎం యంత్రాల్లో 6 వోల్టుల సామ ర్థ్యంతో కూడిన ఆల్కలైన్ పవర్ బ్యాటరీలను ఉపయోగిస్తే, ప్రస్తుత ఎం-3 యంత్రాలలో 7.5 వోల్టుల విద్యుత్ సామర్థ్యంతో కూడిన ఆల్కలైన్ పవర్ బ్యాటరీలను ఉపయోగించ డంతో ఎక్కువసేపు ఇవి పనిచేసేందుకు వీలుంటుంది. ప్రస్తుత ఆధునాతన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎమ్)లు గరిష్టంగా 3,840 ఓట్లను నమోదు చేస్తాయి. ఒక పోలిం గ్ కేంద్రంలో సాధారణంగా మొత్తం ఓటర్ల సంఖ్య 1500కు మించదు.

సీయూ(కంట్రోల్ యూనిట్)

కంట్రోల్ యూనిట్ అనేది పూర్తిగా పోలింగ్ అధికారుల అధీనంలో ఉండే యంత్రం. పోలింగ్ సమయంలో బ్యాలెట్ యూనిట్‌లో వేసిన ఓటు కేబుల్ ద్వారా ప్రయాణించి అధికారి అధీనంలో ఉండే కంట్రోల్ యూనిట్లో నిక్షిప్తమై ఉంటుంది. పోలింగ్ పూర్తయిన అనంతరం వాటిని సీల్ చేసి లెక్కింపు కేంద్రాలకు తరలిస్తారు. కౌంటింగ్ సమయంలో సీయూలోని సమాచారం ఆధారంగానే లెక్కిస్తారు. కంట్రోల్ యూనిట్‌లో నిక్షిప్తమైన సమా చారం దాదాపు 15ఏళ్ల వరకు భద్రంగా ఉంటుంది.

బీయూ (బ్యాలెట్ యూనిట్)..

అభ్యర్థుల పేర్లు, గుర్తులు, ఫొటోలను వరుసగా బ్యాలెట్ యూనిట్‌పై ముద్రిస్తారు. ఒక బ్యాలెట్ యూనిట్‌పై 16 మంది అభ్యర్థులను సూచించే అవ కాశం ఉంది. ఎక్కువమంది అభ్యర్థులు బరిలో ఉం టే మరో బ్యాలెట్ అనుసంధానం చేస్తారు. 2006-10 మధ్యకాలంలో తయారు చేసిన ఎం-2 ఈవీఎం యంత్రాలకు 4 బ్యాలెట్ యూనిట్లను అనుసం ధానం చేసే విధంగా రూపొందించారు. దాదాపు 64మంది అభ్యర్థులు ఏకకాలంలో పోటీ చేస్తున్న సూచించేందుకు వీలు ఉండేది. ప్రస్తుతం ఆధు నాతన ఎం-3 ఈవీఎం యంత్రాలకు 24బ్యాలెట్ యూనిట్లను అంటే మొత్తం 384 మంది అభ్యర్థుల సమాచారం సూచించేందుకు అవకాశం ఉంది.

పారదర్శకంగా ఉంటుంది



ఈవీఎం యంత్రాల ద్వారా ఓటును వినియోగించుకోవడం అనేది అత్యంత పారదర్శకంగా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా, సరళతరంగా చేపట్టడా నికి ఈవీఎం యంత్రాలు అత్యంత ప్రయోజన కరంగా ఉంటాయి. నిర్మల్ జిల్లాలో దాదాపు 4వేల మంది ఎన్నికల సిబ్బందికి ఈవీఎం యంత్రాల పనితీరుపై కలెక్టర్, రిటర్నింగ్ అధికారుల మార్గదర్శనంలో శిక్షణ కొనసాగు తోంది. – మైస అరవింద్ కుమార్, ఎన్నికల శిక్షణ మాస్టర్, నిర్మల్

అంధులకు సైతం అందుబాటులో..

ఈవీఎం ఓటింగ్ యంత్రాల ద్వారా అంధులు కూడా సరళంగా ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్ ఈ ప్రత్యేక యంత్రాన్ని రూపొందిం చింది. బ్యాలెట్ యూనిట్ పై బ్రెయిలీ లిపితో కూడా క్రమ సంఖ్యలను ఏర్పాటు చేసింది.

నగదు పట్టివేత



పోలీసులు పట్టుకున్న నగదు

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి అంత ర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎస్సై డికొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి అనుమతి పత్రా లు లేకుండా తరలిస్తున్న రూ.84వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని బల్లార్షా నుండి సిర్పూర్(టి) మీదుగా అను మతి పత్రాలు లేకుండా నగదును బల్లార్షా పట్టనానికి చెందిన ఆసిఫ్ ఖాన్ నగదు తర లిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా విక్రేత అరెస్టు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేడ్కర్ చౌరస్తా వద్ద అమ్మకానికి తీసుకువెళ్తున్న గుడుం బాను పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మంగళవారం పెట్రోలిం గ్ నిర్వహిస్తుండగా అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల సమ్మయ్య అనే వ్యక్తి ప్లాస్టిక్ క్యాన్‌లలో నింపు కుని విక్రయానికి తీసుకెళ్తుండగా రెండు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితు డిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

బెల్ట్‌షాప్‌లో మద్యం పట్టివేత..

బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీలోని ఓ బెల్ట్ షాపులో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. గద్దెల భూదమ్మ అనే మహిళ తన ఇంట్లో బెల్ట్‌షాప్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. మంగళవారం బెల్ట్ షాప్‌పై దాడి చేసి పది మద్యం సీసాలను పట్టు కున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కోడి కూయకముందే బార్లు ఓపెన్

- ఎన్నికల నిబంధనలు హుళక్కేనా..?
- రహస్యంగా మద్యం అమ్మకాలు
- పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు



తెల్లవారు జామున ఓ బార్‌అండ్ రెస్టారెంట్‌లో..

మంచిర్యాలక్రైం: కోడి కూయక ముందే జిల్లా కేంద్ర ంలో బార్లు తెరుచుకుంటున్నాయి. ఎక్సైజ్ శాఖ ని బంధనల ప్రకారం ఉదయం 10గంటల నుంచి రా త్రి 11గంటల వరకు బార్‌లలో మద్యం అమ్మకాలు నిర్వహించాలి. కానీ దానికి భిన్నంగా రాత్రి 12గం టల వరకు నిర్వహిస్తున్నారు. తిరిగి ఉదయం 7:30 గంటలకే కొందరు రహస్యంగా మద్యం విక్రయా లు చేస్తున్నారు. పైగా ఓ వైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఈ దందా యథావిధిగా నిర్వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమా.. లేక ‘మాముళ్ల’గా తీసు కుంటున్నారనా అనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. పైగా ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం లో జరుగుతుందనుకుంటే పొరపాటే.. నగరం నడి ఒడ్డున ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ బార్ అం డ్ రెస్టారెంట్ రాత్రి 12గంటల వరకు నిర్వహిస్తుం టారు. తిరిగి ఉదయం 7:30గంటలకే తెరుస్తారు. ఉదయం 6గంటల నుంచే ఇక్కడ మందుప్రియులు పడిగాపులు కాస్తుంటారు.

ఎన్నికల కోడ్ వర్తించదా..?

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మద్యం అమ్మ కాలపై పలు ఆంక్షలు భారత ఎన్నికల సంఘం విధించింది. ఈ నిబంధనల ప్రకారం బార్ అండ్ రెస్టారెంట్లకు వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తు న్నారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో జిల్లా లో బెల్ట్‌షాపులపై పోలీసులు విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. లభించిన మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేస్తున్నారు. మరీ బార్ అండ్ రెస్టా రెంట్‌లో ఉదయం 7:30గంటలకే మద్యం అమ్మ కాలపై ఎందుకు పోలీసులు పట్టించుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతం లో ఇక్కడ పనిచేసిన ఐపీఎస్ అధికారి ఏఎస్‌పీ విజయ్‌కుమార్ ఓ రోజు ఉదయం పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా ఉదయం 6గం టలకే మద్యం అమ్మకాల దృశ్యాన్ని గమనించి వాటిపై ఎక్సైజ్, పోలీస్ అధికారులను అప్రమ త్తం చేసి దాడి నిర్వహించి రెండు బార్ అండ్ రెస్టారెంట్ల వ్యాపారులపై కేసు నమోదు చేసిన సంఘటన గతంలో సంచలనం సృష్టించింది.



బతుకమ్మ సంబరాల్లో మహిళలు

అమెరికాలో బతుకమ్మ సంబరాలు



మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన పలువురు మహిళలు అమెరికాలో స్థిరపడగా తెలంగాణ సంస్కృతిని మాత్రం కొనసాగిస్తు న్నారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో సెటిల్ అయిన మంచిర్యాలకు చెందిన తెలుగు కుటుం బాలు సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో శృతి, స్పం దన, సంధ్య, సౌమ్య, శ్వేత, వినీల, స్రవంతి, శిల్పతో పాటు పలువురు పాల్గొన్నారు.

బతుకమ్మలను చూసేందుకు వెళ్తూ..

- ఇద్దరు యువతుల మృత్యువాత
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్ని గుర్తు తెలియని కారు
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం



రాహిత్య(ఫైల్)



సాత్వికా(ఫైల్)

జన్నారం: పండుగ సెలవులకు ఇంటికి వచ్చి బతుకమ్మ వేడుక లను తిలకించేందుకు స్కూటీపై వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాతపడిన సం ఘటన జన్నారం మండలం పొనకల్ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుం బ సభ్యులు, ఎస్సై సతీశ్ వివ రాల ప్రకారం.. పిప్పర్ల గం గన్న సోమవారం రాత్రి 8గం టల ప్రాంతంలో తన కూతురు పిప్పర్ల రాహిత్య(15) తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ప్రధాన రహదారి రేండ్లగూడ వైపు గల తన బంధువు బీట్ అధికారి తరాల్ల సాగర్, జ్యోత్స్న దంపతుల ఇంటికి వచ్చాడు. వారి కూతురు తరాల్ల సాత్విక(18) బైక్‌పై ఎక్కించుకుని ప్రధాన రహదారిపై వెళ్తున్నాడు. చెక్కపెల్లికుంట వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అమ్మాయిలు బైక్‌పై నుంచి ఎగిరిపడ్డారు. గంగన్న బైక్ పక్కనే పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకు లు తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న ముగ్గు రిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అంతలోనే రాహిత్య మృతి చెందింది. గంగన్నకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాహిత్య పదో తరగతి చదువుతుండగా సాత్విక నీట్ కోచింగ్ తీసు కుంటుంది. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెల కొంది. పుప్పర్ల గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఎస్పై తో మాట్లాడుతున్న రేఖానాయక్

పలువురి పరామర్శ

ఇద్దరు అమ్మాయిల మృతి విషయం తెలుసుకుని ఎమ్మెల్యే రేఖానాయక్ మంగళవారం ఇరు కుటుంబాలను పరామర్శించారు. తరాల్ల సాత్విక ఇంటికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు. ఎమ్మెల్యేను చూసి రోదించిన సాత్విక తల్లి జ్యోత్స్నను చూసి ఎమ్మెల్యే కన్నీరు పెట్టుకున్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రమాదానికి కార ణమైన వాహనాన్ని గుర్తించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఎస్సై సతీశ్‌ను ప్రశ్నిం చారు. అదే విధంగా బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ మృతుల కుటుంబీకులను పరామర్శించారు. అటవీశాఖ సిబ్బంది, పలువురు నాయకులు, అధికారులు మృతుల కుటుంబీకులను పరామర్శించారు.

పూల కోసం వెళ్లి బాలుడు...



సందీప్ (ఫైల్)

కౌటాల: దసరా పండుగను ఆ ఇంటిల్లపాది ఆనందం గా జరుపుకున్నారు. పండుగ తెల్లరి ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. వివరాల్లోకి వె ళ్లితే.. కౌటాల మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెం దిన ఎల్ములే భగీరథ్- భగర్తబాయి దంపతులకు ముగ్గురు సంతానం.. వారి చిన్నకుమారుడు సం దీప్(12) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతు న్నాడు. నవరాత్రుల్లో భా గంగా గ్రామంలోని బీసీ కాలనీలో శారదా దేవి వి గ్రహ మండపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు ని ర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పూజలు చేయడానికి మొగడ్‌దగడ్ – కౌటాల ప్రధాన రహదారి సమీపంలోని బావి వద్ద గల పూలు కోయడానికి మంగళవారం ఉదయం సందీప్ కొంత మంది పిల్లలతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో బావి వద్ద పూలను కోస్తుండంగా సందీప్‌కు ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. దీంతో మిగత పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని బాలుడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. చిన్న వయస్సులోనే నీకు నూరేళ్లు నిండాయా అంటూ తల్లిదండ్రులు బోరునా విలపించారు. అంద రితో కలిసి మెలిసి ఉండే బాలుడు పండుగ పూట మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. దీంతో సంఘటనా స్థలాన్ని కౌటాల ఎస్సై మధుకర్ పరిశీలించి వివరాలు సేకరించారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధుడి మృతి



నాగయ్య(ఫైల్)

దహెగాం: అందరు దసరా వేడుకలు జరుపుకోవడానికి సిద్ధ మవుతున్న నేపథ్యంలో గెర్రె గ్రామానికి చెందిన గావిడే నాగయ్య (70) విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... సోమవారం దసరా పండుగ సందర్భంగా పోచమ్మ గుడిపైన వేయడానికి పాలపారక తీసుకురావడానికి గ్రామ సమీపంలోకి వెళ్లాడు. పారక తెం పి కిందకు వేస్తున్న క్రమంలో చెట్టుపై నుంచి ఉన్న విద్యుత్ తీగలు గమనించక పారక తీగలపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో నాగ య్యకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

చెరువులో పడి యువకుడు..



దుశాంత్(ఫైల్)

భీమిని: మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన తోగరి దుశాంత్(30) చెరువులో స్నానానికి సోమవారం వెళ్లాడు. స్నానం చేస్తుండగా లోతట్టు ప్రాంతంలో మునిగి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారువచ్చే సరికి మృతి చెందాడు. తండ్రి కొము రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపాడు.

దసరా వేడుకల్లో వివాదం..

- వెల్గనూర్‌లో ఉద్రిక్తత.
- పలువురికి గాయాలు..
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల ఆందోళన.
- సీఐ హామీతో శాంతించిన గ్రామస్తులు..

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌లో దసరా వేడు కల్లో జరిగిన వివాదం చివరకు ఉద్రిక్తతకు దారితీ సింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. దసరా సందర్భంగా సోమవారం సాయంత్రం గ్రామస్తులు జమ్మికి వెళ్లివస్తున్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన కొంతం నవీన్ అనే వ్యక్తి కారును వేగంగా నడుపుకుంటు వచ్చి పెట్టెం దుర్గ య్యను ఢీకొట్టాడు. దీంతో అతడు కిందపడిపో యాడు. అక్కడే ఉన్న అతడి కుమారులు శ్రీధర్, శ్రీహరి, మనుమలు వికాస్, వంశీలు నవీన్‌ను మం దలించారు. దీంతో కోపొద్రికుడైన నవీన్ అతడి అనుచరులైన కొంతం శరత్, కొప్పుల శ్రీనివాస్, ఎర్రవేని శేఖర్, మొగిలి, మహేష్‌లు దుర్గయ్య కుటుంబీకులను దూషించడంతో పాటు కర్రలతో దాడి చేశారు. దీంతో దుర్గయ్య కుటుంబీకులు అదే రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మళ్లీ మంగళవారం ఉదయం దుర్గయ్య ఇంటికి చేరుకుని కర్రలతో దాడులు చేశారు. అడ్డువచ్చిన కుటుంబీకు లు, బంధువులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మహిళలు కూడా గాయపడ్డారు. గ్రామస్తులం దరూ, దుర్గయ్య కుటుంబానికి మద్దతుగా నిలిచారు. నిందితులపై కఠిన చర్యలు తీసు కోవాలని, గూడెం-మేదరిపేట రింగ్‌రోడ్డుపై మంగ ళవారం ఆందోళనకు దిగారు. పలువురు గ్రామస్తు లు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొప్పుల శ్రీనివాస్ గ్యాంగ్ మెయింటన్ చేస్తూ గ్రామంలో అల్లర్లకు పాల్పడుతున్నాడని, అతడిపై ఇప్పటికే ఎన్నో కేసులు ఉన్నాయని, అతడితో పాటు అతడి అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీ రావాలని పట్టుబట్టారు. ఆందోళన మూడుగంటలకు పైగా సాగింది. దీంతో లక్సెట్టి పేట సీఐ కృష్ణ, దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం ఎస్సైలు ప్రసాద్, సతీష్, లక్ష్మణ్ తో పాటు సిబ్బం ది అక్కడకు చేరుకుని, గ్రామస్తులకు నచ్చజెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

11మంది పై కేసు..

పెట్టెం దుర్గయ్య కుటుంబంపై జరిగిన దాడి లో పెట్టెం శ్రీధర్ ఫిర్యాదు మేరకు కొప్పుల శ్రీనివాస్, ఎర్రవేని మొగిలి, శేఖర్, గణేష్, మహేష్, నవీన్, ఇరుకుల హరీష్, కొంతం శరత్, కాసు రమేష్, కొప్పుల సతీష్, తూము రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఈమేరకు కొందరిని అదు పులోకి తీసుకున్నట్లు చెప్పారు.

బాసరలో ముగిసిన ఉత్సవాలు

భైంసా(ముధోల్): బాసరలో దేవీ నవరాత్రి ఉత్స వాలు ముగిశాయి. తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో సరస్వతీ అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. సోమవారం సరస్వతీ అమ్మవారిని అశ్వ రథంపై ఊరేగించారు. తొమ్మిది రోజులపాటు బాసర ఆలయంలో సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారి దీక్షలు స్వీకరించిన భక్తులు సోమవారం ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో నిత్యాన్నదానం చేసిన నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ గాడిపుర బృందాన్ని సత్కరించారు.

అభిషేకం లడ్డూకు ఫంగస్

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వచ్చే భక్తులకోసం తయారు చేయించిన అభిషేకం లడ్డూలు సరైన చోట నిల్వ ఉంచకపోవడంతో ఫంగస్ ఏర్పడింది. గుర్తించిన ఆలయ సిబ్బంది కొన్నింటిని బయట పారవేశారు. ప్రసాద లడ్డూల నిల్వల విషయంలో అధికారులు నిర్లక్ష్యంచేస్తున్నారంటూ కొంత మంది భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిమజ్జనంపై ప్రత్యేక నజర్

భైంసా పట్టణంలో బుధవారం నిర్వహించనున్న దుర్గామాత నిమజ్జనోత్సవం సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. భవానీచౌక్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభిస్తారు. ప్రధాన మార్గాల్లో పోలీస్ పికెటింగ్ లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శోభాయాత్ర దృశ్యాలను పోలీసులు ప్రత్యేకంగా చిత్రీకరించనున్నారు. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



అశ్వరథంపై ఊరేగుతున్న సరస్వతీ అమ్మవారు